

## బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తుకు నిధులు కేటాయించాలి

మంత్రి శ్రీధర్ బాబుకు వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణా బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తుకు చైర్మన్, సభ్యులను నియమించడంతో పాటు నిధులు కేటాయించాలని బ్రాహ్మణ ఆర్గనైజేషన్స్ ఫర్ సోషల్ సర్వీస్ (బాస్) ప్రతినిధులు బుధవారం ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి వినతి పత్రం సమర్పించారు. 'బాస్' చీఫ్ కోఆర్డినేటర్ బసవరాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ సంఘాల ప్రతినిధులు శాసనసభ ప్రాంగణంలోని కార్యాలయంలో శ్రీధర్ బాబును కలిసి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. నందిరాజు లక్ష్మి నారాయణ, అన్నావజ్జుల సూర్యప్రకాశ్, నిరంజన్ దేశాయి, మంగు రాఘవరావు, ప్రమోద్, వై. శ్రీనివారావులు తమ డిమాండ్లను శ్రీధర్ బాబుకు వివరించారు. వారి డిమాండ్లలో ప్రధానమైనవి. దేవస్థాన పాలక మండళ్లలో బ్రాహ్మణులకు ప్రాతినిధ్యం కల్పించాలి. దేవాలయ ఆస్తులకు రక్షణ కల్పించాలి. దేవాలయ అర్చకుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలి. ధూప దీప నైవేద్యం పథకాన్ని అన్ని ఆలయాలకు విస్తరించి నిధులు పెంచాలి. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్చకులు, పేద బ్రాహ్మణులకు ప్రత్యేక కేటాయింపులు చేయాలి. విశ్రాంత అర్చకులకు పెన్షన్ సదుపాయం కల్పించి, ఇప్పటికే పదవీ విరమణ చేసిన వారినీ ఈ పథకం కింద ప్రయోజనాలు వర్తింపచేయాలి. బ్రాహ్మణ క్రెడిట్ సొసైటిని ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలి. స్థానిక చదువుల కోసం ఆర్థిక సహాయం అందించాలి. నిరుద్యోగులకు ఉపాధి రుణాలు అందజేయాలి. వినతి పత్రం స్వీకరించిన శ్రీధర్ బాబు వారి విన్నపాలను సిఎం దృష్టికి తీసుకెళ్తానని శ్రీధర్ బాబు వారికి హామీ ఇచ్చారు.

# యాసంగి పంటలు, వేసవి కాలం ముగిసే వరకూ అప్రమత్తం

విద్యుత్ అధికారులు, సిబ్బందికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** యాసంగి పంటల సీజన్‌తో పాటు వేసవి ప్రభావం కారణంగా రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలనీ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. వేసవికాలం, యాసంగి సాగు సీజన్ నేపథ్యంలో బుధవారం సాయంత్రం అసెంబ్లీ ఆవరణలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ గత సంవత్సరం మార్చి 20న నమోదైన గరిష్ఠ విద్యుత్ డిమాండ 17,162 మెగావాట్లు కాగా, ఈ సంవత్సరం ఈ నెల 2న 17,606 మెగావాట్ల డిమాండ్‌ను చేరుకుని గత రికార్డును సమం చేసింది. అనంతరం రోజురోజుకీ పెరుగుతున్న డిమాండ్ ఈ నెల 13న 18,228 మెగావాట్లకు చేరి, 341.08 మిలియన్ యూనిట్ల వినియోగంతో కొత్త రికార్డును సృష్టించిందనీ సమావేశంలో వివరించారు. డిమాండ్ భారీగా పెరిగినా సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా, ఓవర్‌లోడింగ్ సమస్యలు తలెత్తకుండా విద్యుత్ సంస్థలు సమర్థంగా వ్యవహరించాయని పేర్కొన్నారు. ఈ కృషికి విద్యుత్ సిబ్బందిని అభినందించారు. అలాగే, విద్యుత్ డిమాండ్ 19 వేల మెగావాట్లకు మించినా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ప్రభుత్వం కొత్త సబ్‌స్టేషన్లు, లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. యాసంగి పంటల సీజన్‌తో పాటు వేసవి కాలం ముగిసేంతవరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రైతాంగానికి, గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని రంగాల వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, తెలంగాణ ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, తెలంగాణ డిస్కమ్‌ల సిఎండిలు ముషారఫ్ ఫరూఖీ, జితేష్ వి. పాటిల్, వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిఎస్ పదవీ కాలం మరో మూడు నెలల పొడిగింపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్)గా ఉన్న రామకృష్ణారావు పద వీ కాలాన్ని మరోసారి మూడు నెలల పాటు పొడిగించా రు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం సిఎస్ పదవీ కాలాన్ని మూడు నెలల పాటు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేర కు కేంద్ర డిఒపిటి బుధవారం రాష్ట్ర ప్రభుత్వానికి లేక రాసింది. ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వుల ప్రకా రం ఏప్రిల్ 1 నుండి జూన్ 30 వరకు రామకృష్ణారావు సిఎస్‌గా కొనసాగనున్నారు. గతంలో రామకృష్ణా రావు పదవీకాలం 2025 ఆగస్టులో ముగిసినప్పటికీ, పరిపాలనా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం 2025 సెప్టెంబర్ నుండి 2026 మార్చి 31వ తేదీ వర కు ఏడు నెలల పాటు మొదటి విడత పొడిగింపు ఇచ్చిం ది. త్వరలో ఆ గడువు ముగియనున్న నేపథ్యంలో, రెం డోసారి కూడా పదవీకాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణ యం తీసుకుంది. ఇదిలా ఉండగా, సిఎస్ పదవీ కానలా న్ని పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్న పరిణామం రాష్ట్ర పరిపాలన వర్గాలలో ప్రాధాన్యత సంతరించుకుంది. సిఎస్ పదవి కోసం ఆశలు పెట్టుకున్న సీనియర్ ఐఎఎస్ అధికారులలో ఈ నిర్ణయం చర్చనీయాంశంగా మారింది.

## ఆర్‌టిసి కార్మికుల వేతన సవరణ ప్రకటించాలి

సంస్థ మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర క్యాబినేట్ మీటింగ్‌లో 60 నెలల జాప్యమైన ఆర్‌టిసి కార్మికుల వేతన సవరణ పై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పదవి విరమణ చేసిన ఉద్యోగులకు సంబంధించి న వేతన సవరణ బకాయిలు చెల్లించాలని, అలాగే 2017, ఏప్రిల్ 1 నుంచి అలవెన్సులు పెంచి, బకాయి లు చెల్లించాలని నాగేశ్వరరావు ఆర్‌టిసి యాజమాన్యాన్ని కోరినట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## నందిని సిధారెడ్డికి సాహిత్య అకాడమీ అవార్డు రావడంపై అరసం హర్షం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజాకవి నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించడంపై తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) హర్షం వ్యక్తం చేసింది. ప్రజాభ్యుదయ లక్ష్యాలతో రచనలు చేస్తున్న సిద్ధారెడ్డి ఈ గౌరవానికి ఎంపిక కావడం సాహిత్య రంగానికి గర్వకారణమని పేర్కొంది. కవిత్వం, వ్యాసాలు, క థానికలు తదితర ప్రక్రియల్లో సిద్ధారెడ్డి చేసిన సేవలు విశేషమని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనంతరం తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించడం ఆయన ప్రతిభకు నిదర్శనమని తెలిపారు. ఇటీవల విడుదలైన 'అనిమేష' కవితా సంపుటికి 2025 సంవత్సరానికి గాను సాహిత్య అకాడమీ అవార్డు రావడం అభ్యుదయ శక్తులకు ప్రేరణనిచ్చే అంశమని అరసం రాష్ట్ర అధ్యక్షుడు పల్లేరు వీరస్వామి, కార్యదర్శి రాపోలు సుదర్శన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అరసం నాయకులు సిధారెడ్డి రచనలను ప్రశంసిస్తూ అభినందనలు తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలి

ఇండ్ల స్థలాల పట్టాలకై 'మార్చి 24 చలో హైదరాబాద్'ని జయప్రదం చేద్దాం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నరసింహ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమస్యల పరిష్కారం కో సం ప్రజలు ఉద్యమాలకు సిద్ధం కావాలని, ఇండ్ల స్థలాల పట్టాలకై మార్చి 24న చేపట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నరసింహ పిలుపునిచ్చారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆరుట్ల రాజ్‌కుమార్ అధ్యక్షతన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఇటి. నరసింహ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పేదలు ప్రభుత్వ, భూదాన్ భూముల్లో గుడిసెలు వేసుకొని బ్రతుకుతున్నారనీ, వారికి కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకపోవడం దారుణమన్నారు. ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో కరెంట్, మంచి నీరు, రోడ్లు లేక ప్రజలు కష్టాలు పడుతూ గుడిసెలలో జీవిస్తున్నారని తెలిపారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 70 ఏళ్ళు గడిచిన పేద ప్రజలకు కనీసం ఇండ్లు లేకపోవటం అత్యంత విషాదమని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు ఇండ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని ఇందిరా పార్కు దగ్గర జరిగే మహా ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి పక్ష పార్టీలు అబద్ధాలను పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారే తప్ప ప్రజల పట్ల ఎలాంటి చిత్తశుద్ధి లేదని అన్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడుల నేపథ్యంలో మన దేశంలో అనేక పరిశ్రమలు, హోటల్స్, హాస్టల్స్ సిలిండర్ సరఫర లేక మూతపడుతున్నాయన్నారు. మన ప్రధాని నరేంద్ర మోదీ మౌనం వహిస్తు దేశ ఆర్థిక వ్యవస్థను పతనం చేస్తున్నాడని విమర్శించారు. అనేక సంవత్సరాలుగా భారత దేశం అన్ని దేశాలతో స్నేహ సంబంధాలను కలిగి ఉండేదని, కానీ నేడు సార్వభౌమాధికారాన్ని అమెరికా ముందు తాకట్టు పెడుతున్న మోదీ నిర్ణయాలకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలను సమీకరించి ఉద్యమాలు నిర్మించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయా దేవి, జిల్లా కార్యదర్శి స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.వెంకటేశం, చంద్ర మోహన్ గౌడ్, నేర్లకంటి శ్రీకాంత్, పడాల నళిని, కాంపల్లి శ్రీనివాస్, మామిడిచెట్ల వెంకటస్వామి,షేక్ శంషుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.




# రాష్ట్ర సిగలో మరో మణిహారం

22న నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభించనున్న సిఎం

వెల్లడించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర సిగలో మరో మణిహారంగా నిలిచే నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ఈ నెల 22న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామితో కలిసి మీడియా సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఈ రైతు మహోత్సవంలో వ్యవసాయం, పశుసంవర్ధక, అనుబంధ రంగాలకు సంబంధించిన మొత్తం 150 స్టాల్స్ ఏర్పాటు కానున్నాయని తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖల విభాగాలు, విశ్వవిద్యాలయాలు, బ్యాంకులు, ఎఫ్‌పిఓలు, స్టార్టప్ కంపెనీలతో పాటు ప్రైవేట్ సంస్థలు తమ ఆధునిక సాంకేతికతలు, సేవలు, అవకాశాలను రైతులకు పరిచయం చేయనున్నామన్నారు. బ్యాంకులు, ఎఫ్‌పిఓలు, స్టార్టప్లు, ప్రైవేట్ కంపెనీల నిపుణులు, శాస్త్రవేత్తలతో రైతులు నేరుగా ముఖాముఖి చర్చించే ప్రత్యేక వేదికను కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 22న ముఖ్యమంత్రి నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించి, రైతన్నలకు అంకితం చేయనున్నారని చెప్పారు. అదే రోజున ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ దగ్గర రూ.80 కోట్లతో నిర్మించే రిఫైనరీ యూనిట్‌కి శంకుస్థాపన కూడా చేయనున్నారని, ఈ వేదిక నుండే ముఖ్యమంత్రి రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## కెటిఆర్‌కు దమ్ముంటే మూసి ఒడ్డున 48 గంటలు నిద్రించి చూపించాలి

రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మూసీ సుందరీకరణ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంచి పేరు వస్తుందనే కడుపు మంటతో కెటిఆర్ విమర్శలు చేస్తున్నారని, ఆయనకు దమ్ముంటే మూసి ఒడ్డున 48 గంటలు నిద్రించి చూపించాలని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రేవ్ పార్టీ, డ్రగ్స్ పార్టీలతో హైదరాబాద్ నగరాన్ని నాశనం చేసిన ఘనత బిఆర్‌ఎస్ నాయకులదే అని మండిపడ్డారు. బిఆర్‌ఎస్ నాయకులకు డ్రగ్స్ టెస్ట్ చేస్తే 90శాతం మందికి పాజిటివ్ వస్తుందని సాయికుమార్ ఆరోపించారు.

## విద్యుత్ సంస్థల్లో రిజర్వేషన్ల అమలు తీరుపై ఆరా

రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో రిజర్వేషన్ల అమలు తీరుపై ఈ నెల 23వ తేదీన ఎస్‌పిడిసిఎల్, 24న జెన్‌కో, ట్రాన్స్‌కో, 26న ఎన్‌పిడిసిఎల్ కార్యాలయాలను సందర్శించనున్నట్లు రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ వెల్లడించారు. రాష్ట్ర బిసి కమిషన్ సమావేశం బుధవారం ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో చైర్మన్ జి. నిరంజన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, కమిషన్ మెంబర్ సెక్రెటరీ బి. బాల మాయ దేవి పాల్గొన్నారు. ఈ సమావేశంలో కమిషన్ వివిధ అంశాలపై చర్చించింది. ముఖ్యంగా, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కమిషన్ ముందున్న పెండింగ్ దస్త్రాలను ప్రత్యేకంగా సమీక్షించి పరిష్కరించాలని కమిషన్ నిర్ణయించింది. కొన్ని దస్త్రాల ఫైళ్ల పరిష్కారానికి సంబంధించి ప్రభుత్వంలోని కొన్ని విభాగాల నుండి సమాచారం అవసరం ఉన్నందున ఆయా ప్రభుత్వ విభాగాలని సంబంధిత సమాచారాన్ని కమిషన్‌కు త్వరితగతిన అందించమని కోరాలని నిర్ణయించింది. ఈ సమావేశానికి డిప్యూటి డైరెక్టర్ యు. శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, ప్రత్యేక అధికారి కుమారి ఎన్. సునీత, సెక్షన్ ఆఫీసర్ జి. సతీష్ కుమార్, రీసెర్చ్ ఆఫీసర్ జి. లక్ష్మి నారాయణ హాజరయ్యారు.

# డొమెస్టిక్ సిలిండర్ దందా!

- బుక్ చేసినా ఇంటికి సిలిండర్ లేదు
- వ్యాపారాలకు మాత్రం బ్లాక్‌లో తరలింపు
- నిద్ర పోతున్న నిఘా అధికారులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డొమెస్టిక్ సిలిండర్ బుక్ చేసి రోజులు గడుస్తున్నా ఇంటికి ఎల్‌పిజి సిలిండర్‌లు రావడం లేదని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. వీరికి డెలివరీ కావాల్సిన డొమెస్టిక్ సిలిండర్లు వ్యాపార వర్గాలకు బ్లాక్‌లో తరలుతున్నాయి. కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో హోటళ్లు, టి టిఫిన్ సెంటర్లు మూత పడుతున్నాయి. కొంత మంది వ్యాపారులు డమెస్టిక్ సిలిండర్లను బ్లాక్‌కు కోనుగోలు చేసి, తమ సొంత వ్యాపారాలకు ఉపయోగించుకుంటున్నారు. కొంత మంది గ్యాస్ ఏజెన్సీలు, డోర్ డెలివరీ చేసే భాయ్‌లు బ్లాక్ దందాకు శ్రీకారం చుట్టారు. ఫలితంగా గృహ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇంటి అవసరాలకు గ్యాస్ సిలిండర్ దొరకక సాధారణ ప్రజలు రోజూ ఇబ్బందులు పడుతున్నారు. గంటల కొద్దీ వేచి చూసినా, బుకింగ్ చేసినా సిలిండర్ అందక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలు ఎన్నో. అయితే ఇదే సమయంలో ఆయా జిల్లా కేంద్రాలు, పట్టణ కేంద్రాలలో కర్రీ పాయింట్లు, బేకరీ,వైన్ షాపుల వద్ద, హోటల్స్ ఇలా అనేక వ్యాపార స్థానాల్లో కమర్షియల్ సిలిండర్ బదులు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు విచ్చలవిడిగా, అక్రమంగా వినియోగం జరుగుతోంది. గృహ వినియోగానికి మాత్రమే ఇచ్చే సబ్సిడీ సిలిండర్లు, వ్యాపారాల కోసం దర్జాగా ఉపయోగిస్తున్నారు ఇది కేవలం చట్ట విరుద్ధం మాత్రమే కాదు, ప్రజల హక్కులపై దాడి. అత్యంత ఆశ్చర్యకరం ఏమిటంటే ఇదంతా బహిరంగంగా జరుగుతున్నా, సంబంధిత అధికారులు మాత్రం కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది. ప్రజల సమస్యలు మాత్రం అలాగే కొనసాగుతున్నాయి ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది.ఇంటి అవసరానికి గ్యాస్ లేదు, వ్యాపారాలకు ఎలా దొరుకుతోంది అని వారు ప్రశ్నిస్తున్నారు.వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని అక్రమంగా డొమెస్టిక్ గ్యాస్ వినియోగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.నిఘా అధికారులు కూడా చూడిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

## ఒక్కరోజే 2,35,678 ఎల్‌పిజి సిలిండర్ల డెలివరీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఎల్‌పిజి సిలిండర్లకు కొరత లేదని రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రములో ఈ నెల 17న ఒక్కరోజే 2,35,678 ఎల్‌పిజి సిలిండర్లను డెలివరీ చేశామని సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. ఎల్‌పిజి సిలిండర్లు రీ ఫిల్లింగ్ కొరకు ఆందోళన చెందవద్దని వినియోగదార్లకు ప్రభుత్వం సూచించింది. సిలిండర్ల డెలివరిలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా మానిటరింగ్ చేసేందుకు పౌర సరఫరాల సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్‌లో అధికారులతో పాటు ఎల్‌పిజి సరఫరా చేసే ఆయిల్ కంపెనీలు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్,హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్ కంపెనీల ప్రతినిధులు ఉన్నారు. ఈ మూడు కంపెనీలు కలిపి సగటున రోజుకు 2,15,151 ఎల్‌పిజి సిలిండర్లు డెలివరీ చేసేవి. మంగళవారం అంతకు మించి డెలివరీ అయ్యాయని పేర్కొంది.

## రైల్వే ప్రయాణికులకు 'రైల్‌వన్' యాప్ హిట్

డౌన్‌లోడ్ చేసుకున్న 2.57 కోట్ల మంది

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రయాణికులకు సులభంగా టికెట్లు బుక్ చేసుకునేలా రైల్వే శాఖ తీసుకొచ్చిన 'రైల్‌వన్' యాప్ భారీ ఆదరణ పొందుతోంది. ఇప్పటివరకు ఈ యాప్‌ను 2.57 కోట్ల మంది డౌన్‌లోడ్ చేసుకోగా, రోజుకు సగటున 7.64 లక్షల టికెట్లు బుక్ అవుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ యాప్ ద్వారా ప్రయాణికులు మొబైల్‌లోనే రిజర్వ్ (పిఆర్‌ఎస్), అన్‌రిజర్డ్స్ (యుటిఎస్) టికెట్లు బుక్ చేసుకునే సౌకర్యం పొందుతున్నారు. అదేవిధంగా ప్లాట్‌ఫారమ్ టికెట్లు, ట్రైన్ సమాచారం, పిఎన్‌ఆర్ స్టేటస్, రైల్మదాద్ సేవలు అన్నీ ఒకే ప్లాట్‌ఫారమ్‌లో అందుబాటులోకి వచ్చాయి. ఒకే లాగిన్‌తో అన్ని సేవలు పొందేలా యాప్‌ను రూపొందించారు.ప్రస్తుతం ఇండియన్ రైల్వే క్యాటరింగ్, టూరిజం కార్పొరేషన్ ద్వారా కూడా రిజర్వ్ టికెట్ల బుకింగ్ కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా రిజర్వ్ టికెట్లలో సుమారు 88శాతం ఆన్‌లైన్‌లోనే బుక్ అవుతున్నాయి అని అధికారులు తెలిపారు. ఇక గ్రామీణ, అర్ధపట్టణ ప్రాంతాల్లో టికెటింగ్ సేవలు విస్తరించేందుకు రైల్వే శాఖ పలు రకాల ఏజెంట్లను నియమిస్తోంది. అన్‌రిజర్వ్ టికెట్ల కోసం హాల్ట్ ఏజెంట్లు, జెటిబిఎస్, ఎస్‌టిబిఎ,ఎంయుటిఎస్ సహాయకులు పనిచేస్తుండగా, రిజర్వ్, అన్‌రిజర్వ్ టికెట్ల కోసం వైటిఎస్‌కె లైసెన్సీలు సేవలు అందిస్తున్నారు.రైల్వే, సమాచార ప్రసార, ఐటి శాఖల మంత్రి అశ్వీనివైష్ణవ్ లోక్‌సభలో ఈ వివరాలు వెల్లడించారు.

# మూసీ అభివృద్ధికి కేటాయింపులు 'ఘనం'

- ఖర్చు అయ్యింది 'స్వల్పం' !
- 12 ఏళ్లలో రూ.4,404కోట్లు కేటాయించినా..వ్యయం రూ.37 కోట్లే



**హైదరాబాద్ :** ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా మూసీ అభివృద్ధి కాగితాలకే పరిమితమైన గణాంకాల గారడీ తప్ప అమలు విషయంలో చిత్తశుద్ధి కొరవడుతోందని పలు పార్టీలు, పౌర సంఘాల ప్రతినిధులు పెదవి విరుస్తున్నారు. తెలంగాణలో పరిపాలించిన, పరిపాలిస్తున్న రెండు ప్రభుత్వాలు మూసీ అభివృద్ధి కోసం చేసే వాదనలు గాలిలో మేడలు కడుతున్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. బిఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో నిధుల కేటాయింపు, వ్యయం మధ్య భారీ వ్యత్యాసాన్ని వారు బట్టబయలుచేశారు. తెలంగాణ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) దాని అనుబంధ విభాగాలైన అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం(ఎడిఎఫ్), హైదరాబాద్ సిటీజెన్స్ ఫోరం (హెచ్‌సిఎఫ్) నిర్వహించిన ఒక మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. పత్రికా సమావేశంలో వారు వెల్లడించిన సమాచారం ప్రకారం.. గత 12 ఆర్థిక సంవత్సరాలలో మూసీ అభివృద్ధి కోసం రూ.4,404 కోట్లు కేటాయించినప్పటికీ సంబంధిత సంస్థ కేవలం రూ. 37కోట్లు మాత్రమే ఖర్చు చేయడం గమనార్హం. ఆ మొత్తం 1 శాతం కన్నా తక్కువే. ఇది ఇలా ఉంటే, మొదటి మూడు సంవత్సరాలపాటు కెసిఆర్ సారథ్యంలోని బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌కు ఎలాంటి కేటాయింపులూ చేయలేదు. తర్వాతి రెండు సంవత్సరాలలో బడ్జెట్‌లో సంవత్సరానికి రూ.377.35 కోట్ల నిధుల కేటాయింపు చూపించారు కానీ ఖర్చు రూ.3.12కోట్లకు మాత్రమే పరిమితమైంది.2019–20 కాలంలో రూ. 48.95 కోట్ల కేటాయింపు జరిగింది. కానీ వ్యయం మాత్రం శూన్యంగా ఉంది. కాగా, ఆ తర్వాతి సంవత్సరంలో ఎలాంటి కేటాయింపు జరుగనప్పటికీ వచ్చే మూడు సంవత్సరాలలో ప్రతీ సంవత్సరానికి రూ.200 కోట్లు కేటాయించారు. అయితే 2021–22లో ఏ ఒక్క పైసా ఖర్చు చేయడం గమనార్హం. 2022–23లో రూ. 4.94కోట్లు, 2023–24లో రూ.11.15 కోట్లు ఖర్చు చేశారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెండు బడ్జెట్లలో కేటాయింపులు రూ.1,500 కోట్లకు పెరిగినప్పటికీ ఖర్చు చేసిన మొత్తం మాత్రం చాలా తక్కువగానే ఉంది. 2024–25 కాలంలో రూ.11.55 కోట్లు, 2025–26 కోసం రూ. 6.21 కోట్లు (ఇప్పటివరకూ) ఖర్చు చేయడం జరిగింది. గత 12సంవత్సరాలుగా మూసీనదిని శుభ్రపర్చేందుకు ఏమీ ఖర్చుచేయలేదు కానీ ప్రచారపటాటోపం మాత్రం శృతిమించిపోయిందని అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం, హైదరాబాద్ సిటీజెన్స్ ఫోరం విడుదల చేసిన ఒక ప్రకటన వెల్లడించింది.

## బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి తూళ్ల దేవేందర్‌గౌడ్



ప్రజాపక్షం/రంగారెడ్డి: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి తూళ్ల దేవేందర్‌గౌడ్‌కు అని బిజెపి రాష్ట్ర నాయకులు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం తూళ్ల దేవేందర్ గౌడ్ జన్మదినం సందర్భంగా ఆయన అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వీరేందర్ గౌడ్,భుజంగ రెడ్డి,నర్సింగ్ రాజ్,గాజుల మధు, రత్నం, బరిగెల శ్రీధర్ పాల్గొన్నారు.

## గ్రీన్ ఫిల్డ్ రోడ్డు నిర్మాణానికి భూములు ఇవ్వం



ప్రజాపక్షం/యాచారం : గ్రీన్ ఫిల్డ్ రోడ్డు నిర్మాణం కోసం ఎట్టి పరిస్థితిలో భూములు ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు తెల్చి చేప్పారు. బుధవారం రెండవ రోజు మంగలి గడ్డ తండా, మర్లకుంట తండాకు చెందిన రైతులు నిరహార దీక్ష చేపట్టారు. ఈ సంధర్భంగా రైతులు మాట్లాడుతూ భూసేకరణ పేరుతో ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. అధికారులు రైతులకు స్పష్టమైన హామీ ఇచ్చేవరకు నిరహార దీక్ష కొనసాగుతుందని తెలిపారు. నాలుగు గ్రామాల రైతులతో అందోళన తీవ్రతరం చేస్తామని రైతులు హెచ్చరించారు.

## ఫ్యూచర్ సిటీ రోడ్డు పరిశీలన



ప్రజాపక్షం/యాచారం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ సిటీ రోడ్డు పనులను బుధవారం ఇబ్రహింపట్నం ఆర్‌డిఒ అనంతరెడ్డి పరిశీలించారు. నాగార్జున సాగర్ పైనున్న తక్కళ్ళపల్లి గెటు నుంచి ఫ్యూర్ సిటీకి ప్రభుత్వం 100 ఫీట్ల రోడ్డు వేయడానికి అధికారులు నిర్ణయించారు. ఆ రోడ్డు తక్కళ్ళపల్లి గ్రామం బయట నుండి రోడ్డు వేయడానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. టిజి ఐఐసి అధికారులు రోడ్డుకు సంబందించిన మ్యాప్‌ను ఆర్‌డిఒకు చూయించారు. అనంతరం మేడిపల్లి గ్రామంలో రోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో అర్ఐ మురిళి, తక్కళ్ళపల్లి గ్రామ సర్పంచ్ నరేంధర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు అరికట్టాలి



ప్రజాపక్షం/యాచారం : బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతిఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఇబ్రహింపట్నం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వినితదేవి అన్నారు. బుధవారం ప్రజాపాలన ప్రణాళికలో భాగంగా మేడిపల్లి రెండవ సెక్టారులో గ్రామ సర్పంచ్ ముచర్ల సుగుణ సంపత్ అధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి సూపర్ వైజర్ తులసి, వార్డుమెంబర్లు జ్యోతి, మాధవి,రిటైర్డ్ ఉపాధ్యాయులు పాపిరెడ్డి, ఎఎన్ఎం జయమ్మ, అంగన్‌వాడి టిచర్లు రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి,సవిత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ప్లాట్లు మున్సిపాలిటీలో మ్యుటేషన్ కాకుండా చర్యలు



ప్రజాపక్షం/షాద్‌నగర్: గ్రామ పంచాయతీ ప్లాట్లను మున్సిపాలిటీలో మ్యుటేషన్ కాకుండా సబ్ రిజిస్ట్రేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని లింగారెడ్డిగూడ సర్పంచ్ ఎంసి ప్రవీణ్‌కుమార్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్‌లు కోరారు. బుధవారం ఫరూఖ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందుకు సబ్‌రిజిస్ట్రార్ స్పంధిస్తూ ఇక మీదట అలాగే చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## శాంతియుత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలి



ప్రజాపక్షం/కొత్తూరు: శాంతియుత వాతావరణంలో పండుగలను నిర్వహించుకునేందుకు ప్రజలందరు కృషి చేయాలని కొత్తూరు సిఐ నర్సయ్య సూచించారు. బుధవారం కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో సిఐ నర్సయ్య ఆధ్వర్యంలో రానున్న హనుమాన్ జయంతి, శ్రీరామనవమి, రంజాన్ పండుగలను పురస్కరించుకొని శాంతి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐ నర్సయ్య మాట్లాడుతూ పండుగలు ఏవైనా శాంతియుతంగా నిర్వహించుకొని ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రశాంత వాతావరణంలో హిందూవులు, ముస్లింలు పండుగలను జరుపుకోవాలని సూచించారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. సోదరభావంతో పండుగలు నిర్వహించుకుంటే శాంతి భద్రతలకు విఘాతం కలగదని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ గోపాల కృష్ణతోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### ఉదయం 9.30 గంటల కల్లా

# రోడ్లపై చెత్త కనిపిస్తే కఠిన చర్యలు

#### జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన '99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశించారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పని చేయాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం 9.30 గంటల కల్లా ప్రధాన రహదారులపై చెత్త పూర్తిగా తొలగించి శుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత డిప్యూటీ కమిషనర్లు, ఎస్‌డబ్ల్యూఎం డిఈలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉదయం 10 గంటల తర్వాత ప్రధాన రహదారులపై క్లీనింగ్ పనులు కనిపించకుండా ముందస్తు ప్రణాళికతో పూర్తి చేయాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం బాధ్యత ప్రధానంగా డిప్యూటీ కమిషనర్లు, ఎస్‌డబ్ల్యూఎం డిఈలదేనని స్పష్టం చేశారు. గ్రీన్ వెస్ట్ తొలగింపు బాధ్యతను కూడా ఎస్‌డబ్ల్యూఎం విభాగానికి అప్పగించారు. సి అండ్ డి వ్యర్థాలు, దీర్ఘకాలంగా పేరుకుపోయిన చెత్తను త్వరితగతిన తొలగించేందుకు అదనపు వాహనాలు అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

## ఇవిఎం గోదాంను పరిశీలించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి

ప్రజాపక్షం/హైదరాబాద్ : నగరంలోని చుడీబజార్ ప్రాంతంలో ఉన్న ఈవిఎం గోదాంను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌ల భద్రత కోసం అమలు చేస్తున్న చర్యలను సమీక్షించారు. గోదాంలో 24 గంటల నిఘా వ్యవస్థ, భద్రతా ఏర్పాట్లు, సరైన వెంటిలేషన్, అగ్నిమాపక సదుపాయాలు, నిరంతర విద్యుత్ సరఫరా, పవర్ బ్యాకప్ వ్యవస్థలను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని నిబంధనలు పాటిస్తున్నారో లేదో ఆరా తీశారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఎన్నికల విభాగం అదనపు కమిషనర్ చంద్రకళ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



## క్రీడలు శారీరక, మానసిక వికాసానికి తోడ్పాటు

#### ఇస్కి డైరెక్టర్ డాక్టర్ రామేశ్వర్‌రావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఇస్కీ) డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు అన్నారు. ఎస్కీ ఆధ్వర్యంలోని ఎస్‌పిజిఎస్ విద్యార్థుల కోసం నిర్వహించిన క్రీడాకార్యక్రమం ముగిసింది. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, క్యారమ్స్ వంటి పోటీల్లో సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు కేవలం వినోదం మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అశోక్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గిస్తాయని, ఇతరరంగాల్లో కూడా ప్రతిభను పెంపొందించుకోవాలని సూచించారు. విజేతలకు అభినందనలు తెలిపారు.

### ముందస్తు చర్యలతో

# వరదల నివారణపై హైడ్రా దృష్టి

#### హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : నగరంలో వరదల ముప్పును తగ్గించేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ తెలిపారు. బుధవారం సెంట్రల్ వాటర్ కమిషన్ నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాకాలానికి ముందే ప్రమాద ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. నగరంలో గొలుసుకట్టు చెరువులు, వరద కాలువల పునరుద్ధరణకు పెద్దపీట వేస్తున్నామని, 24 చెరువుల పునరుద్ధరణ చేపట్టి వాటిలో కొన్ని ఇప్పటికే పూర్తి చేశామని తెలిపారు. చెరువులు, నాలాల ఆక్రమణలను తొలగించడం ద్వారా వరద ముప్పును తగ్గిస్తున్నామని చెప్పారు. పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో సహజ వనరులను సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.



#### వెంగళరావు నగర్‌లో ప్రభుత్వ భూమి రక్షించిన హైడ్రా

ఖైరతాబాద్ మండలం వెంగళరావు నగర్‌లో రూ.600 కోట్ల విలువైన 3ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా రక్షించింది. ఈ భూమిపై ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుని బుధవారం ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. హౌసింగ్ బోర్డు సేకరించిన భూమిలో భాగంగా ఉన్న ఈ స్థలంపై పలువురు తప్పుడు పత్రాలతో ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. హైకోర్టు స్టే ఉన్నప్పటికీ కొత్తగా నిర్మాణాలు చేపట్టినట్లు ఫిర్యాదులు రావడంతో హైడ్రా చర్యలు తీసుకుంది. ఆక్రమణలను తొలగించి భూమి చుట్టూ ఫెన్సింగ్‌వేసి, ప్రభుత్వభూమిగా బోర్డులు ఏర్పాటు చేశారు. భవిష్యత్తులో ఇటువంటి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హైడ్రా అధికారులు హెచ్చరించారు.

# సర్వమతాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

#### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





ప్రజాపక్షం/షాద్‌నగర్: సర్వ మతాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంటుందని, అందుకే పండుగల ప్రత్యేకతను దృష్టిలో పెట్టుకొని రంజాన్ తోఫా అందిస్తున్నామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లింలకు రంజాన్ తోఫాలను అంధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లింలకు రంజాన్ తోఫా ప్రభుత్వం అంధించడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ పరంగా ఇఫ్తార్ విందు ఇవ్వడమే కాకుండా రంజాన్ తోఫాలను సైతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందిస్తున్నారని గుర్తు చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, కేశంపేట, ఫరూఖ్‌నగర్, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాలతోపాటు రెండు మున్సిపాలిటిలకు మొత్తం ఒక వెయ్యి రంజాన్ తోఫాలు వచ్చాయని, అందులో షాద్‌నగర్ మున్సిపాలిటికి కేవలం 250రంజాన్ తోఫాలు వచ్చాయని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రంజాన్ తోఫాలను ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రజలందరు సుఖ సంతోషాలతో పండుగలను నిర్వహించుకోవాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప, వైస్ చైర్మెన్ అందె మోహన్, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్ ఖాన్, కౌన్సిలర్ దిలీప్‌కుమార్, ఫరూఖ్‌నగర్ తహశీల్దార్ నాగయ్య, నేతలు వావిలాల సుజీవన్, మహ్మద్ ఇబ్రహీం, జమ్రుద్‌ఖాన్, ముబారక్ అలీఖాన్‌లు పాల్గొన్నారు.

## మున్సిపల్ వైస్‌చైర్మన్ అందె మోహన్ జన్మదిన వేడుకలు

ప్రజాపక్షం/షాద్‌నగర్: బుధవాపట్టణంలోని క్యాంపు కార్యాలయంలో 14వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ జన్మదినం సందర్భంగా రం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, మహ్మద్ ఇబ్రహీం, ముబాకర్ అలీఖాన్, వెల్‌జర్ల సర్పంచ్ బాబునాయక్, సుజీవన్, రాజేష్‌కుమార్, శ్రీనునాయక్, జాంగారి నర్సింహులు, కుమారస్వామి గౌడ్, తుపాకుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## కొత్తూరు తహసీల్దార్‌గా ముంతాజ్ భేగం



ప్రజాపక్షం/కొత్తూరు: కొత్తూరు తహసీల్దార్‌గా ముంతాజ్ భేగం బాధ్యతలు స్వీకరించారు. బుధవారం బాధ్యతలు తీసుకున్న తహసీల్దార్ ముంతాజ్‌భేగంను మండల కాంగెస్ పార్టీ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, గూడూరు సర్పంచ్ దయానంద్ గుప్తా, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు, పెంజర్ల సర్పంచ్ ఎర్రోళ్ల జగన్‌లు మర్యాదపూర్వకంగా కలిసి పూలబోకే అందించి సన్మారించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తూ భూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అంధించేందుకు కృషి చేయాలని వారు కోరారు.

# ప్రజలకిచ్చిన హామీలు అమలు చేస్తాం

#### చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



ప్రజాపక్షం/షాబాద్: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. బుధవారం షాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో షాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కళ్యాణ లక్ష్మీ, షాధీముబారక్ చెక్కులను జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ ఎలుగంటి మధుసుదన్ రెడ్డి పార్టీ నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యాదయ్య మాట్లాడుతూ మహిళలు ఆత్మగౌరవంతో జీవించే విధంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కళ్యాణలక్ష్మీ, షాధీముబారక్ చెక్కులను ప్రతి నెల నెల అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి, సర్పంచ్‌లు గుండాల అశోక్, ప్రభాకర్ రెడ్డి, శాతమ్మ, చెన్నయ్య, సవిత తహసీల్దార్ అన్వర్, ఎంపిడిఒ అపర్ణ, పార్టీ నాయకులు జనార్ధన్ రెడ్డి, శశిధర్ రెడ్డి, గౌరీశ్వర్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.


# సంస్కృతీ, సంప్రదాయాలకు చిహ్నాలు పండుగలు



ప్రజాపక్షం/రంగారెడ్డి: సంస్కృతీ, సంప్రదాయలకు చిహ్నాలు పండుగలు అని, తెలుగు వారి నూతన సంవత్సరాది పండుగ ఉగాది అని, ఇది ప్రకృతిలో మార్పులు, కొత్త ఆశలు, షడ్రుచుల సమ్మేళనంతో కూడిన సాంస్కృతిక పండుగ అని నారాయణ విద్యా సంస్థల జిఎం గోపాల్ రెడ్డి, హస్తినాపురం నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ జివిఎల్ శారద అన్నారు. బుధవారం హస్తినాపురం నారాయణ స్కూల్‌లో పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను స్థానికంగా ఉన్న నారాయణ ఒలింపియాడ్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు ఉగాది ప్రాధాన్యతపై ప్రసంగాలు, పాటలు, నృత్యాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఉగాది పచ్చడి ప్రాముఖ్యతను వివరించడంతో పాటు, భారతీయ సంృతి సంప్రదాయాలను వివరించారు. ఈ సందర్భంగా నారాయణ విద్యా సంస్థల జిఎం గోపాల్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ జివిఎల్ శారద మాట్లాడుతూ ఉగాది తెలుగు వారి నూతన సంవత్సర పండుగన్నారు. ఇది ప్రకృతిలో మార్పులు, కొత్త ఆశలు, షడ్రుచుల సమ్మేళనంతో కూడిన సాంస్కృతిక పండుగ. చైత్ర శుద్ధ పాడ్యమి నాడు జరుపుకునే ఈ పండుగ, జీవితంలోని కష్టసుఖాలను సమంగా స్వీకరించాలని, కొత్త ఆరంభాలతో విజయాలు సాధించాలని సూచిస్తుందని తెలిపారు. విద్యార్థులు సంప్రదాయాలను కాపాడుతూ ముందుకు సాగాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో విలువలను పెంపొందిస్తాయని తెలిపారు. ఉగాది పచ్చడిలోని ఆరు రుచులు జీవితంలోని అనుభవాలను సూచిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో దిల్‌సుఖ్ నగర్ డివిజన్ ఎజిఎం హేమెంబెర్, ఆర్ఐ రవి, ప్రసాద్, ప్రిన్సిపాల్ అనిల్, ఈ చాంప్స్ ఆర్ అండ్ డి హెడ్ మహేశ్వరి, కో ఆర్డినేటర్ గాయత్రీ, వైస్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఈ కిడ్జ్ ఆర్ అండ్ డిహెడ్ మీనా, కోఆ ర్డినేటర్ శిరీష, వైస్ ప్రిన్సిపాల్ శిల్ప, ఎఒలు రాజేష్, కరుణాకర్, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చివరగా విద్యార్థులకు ఉగాది పచ్చడి, స్వీట్స్ అందజేశారు.

## సొంతింటి కల సాకారానికి కృషి

ప్రజాపక్షం/కేశంపేట : పేదలకు సొంతింటి కల సాకారం కాంగ్రెస్ ప్రభుత్వంతో నెరవేరుతుందని లేమామిడి సర్పంచ్ సులోచన శ్రీను అన్నారు. బుధవారం కేశంపేట మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో వడ్డే కవిత నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని సర్పంచ్ సులోచన శ్రీను గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సులోచన శ్రీను మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రమోద్‌రెడ్డి, అల్వాల ప్రకాష్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డి, వార్డు సభ్యులు కుమార్ గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, సురేందర్, దప్పు లక్ష్మమ్మ, వినోద్‌కుమార్, గ్రామస్తులు బాలాజీ, కావలి వెంకటేష్, మణేమ్మ పాల్గొన్నారు.





## డ్రగ్స్ పరీక్షలు చేయించుకోవాలని సవాళ్లు రాజకీయ దిగజారుడుకు నిదర్శనం

సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు

**ప్రజాపక్షం/సూర్యాపేట:** పాలక, ప్రతిపక్షాలు డ్రగ్స్ పరీక్షలు చేయించుకోవాలని ఒకరిపై ఒకరు ఛాలెంజ్‌లు విసురుకోవడం రాజకీయ దిగజారుడుకు నిదర్శమని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి. రాఘవులు విమర్శించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర శాసనసభ సమావేశా లలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ మాట్లాడుతున్న మాటలు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనంగా ఉన్నాయన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలు, బూర్జువా నాయకులు డ్రగ్స్ వాడుతున్నా యంటే రాజకీయాలు ఎలా దిగజారుతున్నాయో అర్థమవుతుందన్నారు. అలాంటి వాళ్లను ఆయా పార్టీలు ప్రక్షాళన చేసేందుకు ఏమి చర్యలు తీసుకుంటాయో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. డ్రగ్స్ కేసులో దొరికిన వారికి నోటీసులు ఇవ్వడమే కాదని ఆయా పార్టీలు వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇరాన్‌పై యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. జనాభా లెక్కలు, డిలిమిటేషన్ తర్వాత పార్లమెంట్‌లో పెడతామని చెప్పడంలో అర్థం లేదన్నారు. రోహిత్ వేముల చట్టాన్ని వెంటనే తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి, నాయకులు కొలిశెట్టి యాదగిరిరావు, ములకలపల్లి రాములు, మట్టిపెల్లి సైదులు, ధనియాకుల శ్రీకాంత్, కందాల శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

## విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు



**ప్రజాపక్షం/సూర్యాపేట :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా వివిధ అంశాలపై పోలీసు అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారుల నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. సామాజిక రక్షణ, శాంతిభద్రతల అంశాలు, చట్టాల అమలు, సామాజిక భద్రతలో పౌరుల బాధ్యత, రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ, సైబర్ మోసాల నివారణ, మహిళల భద్రత, యువత భద్రత అంశాలపట్ల ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. అక్రమ రవాణా, అసాంఘీక కా ర్యకలాపాలపై పటిష్ట నిఘా ఉంచి నివారించాలని ఆదేశించారు. అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, కోదాడ డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి, సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్న కుమార్, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ మగ్ధూమ్‌అలీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సిఐలు, ఎస్‌ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం/రామన్నపేట :** హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి 65 పంతంగి టోల్ గేట్ వద్ద ఆటోలో తరలిస్తున్న 60.685 కిలోల ఎండు గంజాయి పట్టుబడింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎ.శ్రీనివాస్ రెడ్డి, డిస్ట్రిక్ట్ ప్రోహిబిషన్ , ఎక్సైజ్ అధికారి ఎం.విష్ణుమూర్తిల ఆదేశాల మేరకు రామన్నపేట ఎస్‌హెచ్‌ఓ ఆర్.బాలోజి నాయక్ , మోత్కూర్ ఎస్‌హెచ్‌ఓ కె.రవిచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో పంతంగి టోల్‌గేట్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వస్తున్న ఒక ఆటోను ఆపి తనిఖీ చేయగా దానిలో 60.685కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. ఈ గంజాయిని ఏ1గా మహారాష్ట్రకు చెందిన గంగాబాయ్ పాండు రంగ్ చౌహాన్, ఏ2గా కమల్ అర్జున్ మోహితే, ఏ3గా విజయ్ ఆసరం గోరపడే, నల్లగొండకు చెందిన వ్యక్తి వల్లపు దాసు వేణు కుమార్ ఏ4గా ఉండగా,వీరంతా ఒడిశా రాష్టం లోని భరంపూర్ నుండి హైదరాబాద్ మీదుగా మహారాష్ట్రకి తరలిస్తూ పట్టుబడ్డారని, తదుపరి విచారణ నిమిత్తం ఈ గంజాయిని,1 ఆటో, 2సెల్‌ఫోన్, ముద్దాయిలను , ముద్దాయి వద్ద గంజాయి ( వీటి మొత్తం విలువ సుమారు రూ.25లక్షలు) రామన్నపేట ఎక్సైజ్ స్టేషన్ కి తరలించడం జరిగిందని బాలోజీ నాయక్ తెలిపారు. ఈ తనిఖీలలో ఎస్‌ఐలు ఎన్.శంకర్, బి.శివ కృష్ణ,పి. సత్యనారా యణ కానిస్టేబుల్స్ తిరుమలేష్,రావొజీ, అనిల్, కృష్ణ రెడ్డి, గోపీనాథ్ రెడ్డి, వెంకట్, రహమాన్, రమేష్ రెడ్డి, సోనీ, స్వప్నలు పాల్గొన్నారు.

## మత సామరస్యానికి ప్రతీక రంజాన్



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డిలు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 29వ వార్డు కౌన్సిలర్ రాపర్తి భవాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తోఫా పంపిణీ కార్యక్రమానికి వారు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ పండుగ పవిత్రతకు, త్యాగానికి చిహ్నమని రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో ఆనందోత్సవాలతో జరుపుకోవాలన్నారు. అనంతరం ముస్లింలకు రంజాన్ తోఫా అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అంజద్‌అలీ, కౌన్సిలర్లు దిలీప్ రెడ్డి, గునగంటి హేమ సతీష్, దండు మైసమ్మ దేవాలయం చైర్మన్ కర్ణాకర్ రెడ్డి, నాయకులు మొరిశెట్టి లక్షాది, అనంతుల మల్లయ్య పాల్గొన్నారు.

## రీ సర్వేకు సహకరించాలి

**ప్రజాపక్షం/నూతనకల్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భూముల రీ సర్వే చేయుటకు గ్రామాలకు వచ్చే రెవెన్యూ సిబ్బందికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తహశీల్దార్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని ఎడవెల్లి, పెదనెమిల గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి మాట్లాడారు. రీ సర్వే వలన రైతులకు కలిగే ఉపయోగాలను భూతగాదాలు లేకుండా భూ సరిహద్దులను ఏర్పాటు చేయుటకు రైతులు సహకరించాలని కోరారు. సర్వే అనంతరం రైతులకు భూభారతి చట్టం ప్రకారం భూ ఆధార్ కార్డును ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు జటంగి సరిత కృష్ణ, చురుకంటి లావణ్య మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

## పట్టు పురుగుల పెంపకంతో రైతులకు బంగారు భవిష్యత్

నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ పిలుపు

నరసింహపురంలో పట్టుపురుగుల పెంపకం కేంద్రం సందర్శన



**ప్రజాపక్షం/నల్లగొండ (కనగల్):** ప్రభుత్వ చేయూతతో పాటు నూతన సాంకేతికతను వినియోగిస్తే రైతులు వ్యవసాయంలో అధిక ఆదాయం పొందవచ్చని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.ముఖ్యంగా పంట మార్పిడిలో భాగంగా పట్టుపురుగుల పెంపకంపై దృష్టి సారిస్తే లాభదాయకమైన ఫలితాలు వస్తాయని ఆయన సూచించారు.బుధవారం కనగల్ మండలం నరసింహపురం గ్రామంలో రైతు పుండరీకం నిర్వహిస్తున్న పట్టుపురుగుల పెంపకం కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు.ఈసందర్భంగా పట్టుపురుగుల పెంపకానికి అవసరమైన భూమి,పెట్టుబడి,వాతావరణ అనుకూలత, కూలీల అవసరం వంటి అంశాలపై రైతుతో చర్చించి వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పట్టుపురుగుల పెంపకానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని, రైతులు దీన్ని అవకాశంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 2న జరిగే ప్రజాపాలనప్రగతి ప్రణాళిక గ్రామసభల్లో ఈ పంటపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ సబ్సిడీలు,ఆధునిక పద్ధతులు ఉపయోగించుకుంటే మంచి లాభాలు సాధ్యమని చెప్పారు.ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలపై కూడా కలెక్టర్ సమీక్షించి,త్వరితగతిన పూర్తి చేయాలని సర్పంచ్‌లకు ఆదేశించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లుల విషయంలో కూడా వివరాలు తెలుసుకుని, సంబంధిత ప్రక్రియలను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ డిడి సుభాషిని,హార్టికల్చర్ అధికారి అనంతరెడ్డి,నరసింహపురం సర్పంచ్ రాజేశ్వరి,ఇతర గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు. నిర్మాణాలు పూర్తయిన ఇందిరమ్మ ఇండ్ల ను గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. బుధవారం నల్గొండ జిల్లా కనగల్ మండలం తెలకంటి గూడెంలో ఇందిరమ్మ ఇండ్లను ఆయన పరిశీలించారు. గ్రామంలో ఇందిరమ్మ పథకం కింద నిర్మిస్తున్న మొత్తం ఇండ్లు, ఇప్పటికే ప్రారంభమైనవి, ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఇండ్ల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.నిర్మాణాలు పూర్తయిన ఇండ్లను త్వరితగతిన ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని ఈ సందర్భంగా సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల కాలనీలో తాగు నీటి ఎద్దడి సమస్య ఉందని, ముఖ్యంగా ఎండా కాలంలో ఇబ్బందులు ఎక్కువగా ఉంటాయని గృహ లబ్ధిదారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రస్తుతం దూర ప్రాంతాల నుంచి పైపు లైన్ల ద్వారా నీటిని తెచ్చుకుంటున్నట్లు వారు తెలిపారు. ఈ సమస్యపై స్పందించిన కలెక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని తెలకంటి గూడెంకు పంపించి పరిస్థితులను పరిశీలింపజేస్తామన్నారు.

## రాయితీ పథకాలతో యువత ఆర్థికంగా ఎదగాలి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పథకాలతో నిరుద్యోగ యువత స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. షెడ్యూల్ కులాల కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ, ట్రాన్స్‌పోర్ట్, విద్యుత్, బ్యాంకర్స్‌తో కలెక్టర్ వెబ్‌ఎక్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం ఉపాధి కల్పనకు 2025/26 ఆర్థిక సంవత్సరానికి ఎస్‌సి కార్పోరేషన్ ద్వారా రాయితీలపై నిరుద్యోగ యువతీ, యువకులకు ఎలక్ట్రానిక్ వాహనాలు, వ్యవసాయ పరికరాలు అందజేసేందుకు కార్యాచరణను ప్రకటించిందన్నారు. జిల్లాలోని ఎస్‌సి యువతీ యువకులు స్వయం ఉపాధి పథకములకే దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లుగా తెలిపారు. జిల్లాలో కార్యాచరణ పథకంలో భాగంగా ట్రాన్స్‌పోర్ట రంగం కోసం 193 ఈవి ద్విచక్ర వాహనాలు కేటాయించిందని, ఈవి టూవీలర్ యూనిట్ విలువ రూ.లక్ష కాగా, అందులో 90 సాతం రాయితీ ఉంటుందని, 10 శాతం బ్యాంక్ లోన్ ఉంటుందని తెలిపారు. అలాగే 95 త్రీవీలర్, సోలార్ యూనివర్సల్ కంట్రోల్ యూనిట్, సోలార్ యూనివర్సల్ పంప్ కంట్రోల్ యూనిట్లు మంజూరు చేయబడ్డాయన్నారు. లబ్ధిదారులను జిల్లాస్థాయి కమిటి ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, కార్యనిర్వాహక సంచాలకులు దయామణి, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి జయప్రకాశ్ రెడ్డి, ఎల్‌డిఎం ఎంవిఎన్ ప్రసాద్, ఎలక్ట్రికల్ ఏడి అశోక్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## గురజాల నుండి జానకిపురం వరకు డబుల్ రోడ్డు పనులు ప్రారంభించాలి



సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ చేడే చంద్రయ్య

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** అడ్డగూడూరు మండలం సిపిఐ సమావేశం కామ్రేడ్ సోలిపురం నాగిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కామ్రేడ్ చేడే చంద్రయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ బునాది గాని కాలువ పనులు చేపట్టి అడ్డగూడూరు మండలానికి సాగునీరు అందించాలన్నారు. అదేవిధంగా గురజాల నుండి జానకిపురం వరకు డబల్ రోడ్డు పనులు వెంటనే ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుబంధును వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని, రెండు లక్షల వరకు రుణమాఫీ జరగని రైతులందరికీ వెంటనే రుణమాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మధ్యకాలంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మనువాదం గురించి మాట్లాడుతున్న సందర్భంలో హిందువులను గాని బిజెపి పార్టీనిగాని ఒక్క మాట కూడా అనలేదని వారి మాటలను బిజెపి, ఆర్ఎస్ఎస్ వాళ్లు వక్రీకరించి తెలంగాణ రాష్ట్రంలో మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా దళితుల మీద దాడులు చేస్తూ రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర చేస్తున్న బండి సంజయ్ ప్రోద్భలంతో దాడి చేసిన బీజేవైఎం నాయకులపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులు పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి రేకల శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు ఉప్పుల శాంతి కుమార్, కంచనపల్లి ఉపసర్పంచ్, బెల్లి శ్రీకాంత్, మండల కౌన్సిల్ సభ్యులు భోనుగ సుదర్శన్ రెడ్డి, చక్కా సోమయ్య, చేడే సుందరయ్య పాల్గొన్నారు.



## ఆరోగ్యం పట్ల అనునిత్యం అప్రమత్తం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ఆరోగ్యం పట్ల నిత్యం అప్రమత్తం అవసరమని మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పోచంపల్లిలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. జిల్లా ఉప, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ యశోద పర్యవేక్షించారు.క్యాంపులో డా. మృదుల గైనకాలజీ స్పెషలిస్ట్, డా.సుమంగళి దంత వైద్య నిపుణులు, డా.రమేష్ ఆర్థోపెడిక్, డా.సాయి తేజ, జనరల్ ఫిజీషియన్, డా.రక్షిత చిన్న పిల్లల వైద్య నిపుణులు, డా.వాసుదేవ్, ఆనంద్ కంటి వైద్యనిపుణులు పాల్గొని క్యాంపుకు వచ్చిన 182 మంది రోగులను క్షుణ్ణంగా పరిశీలించి వారికి అవసరమైన రక్త పరీక్షలు, మందులు పంపిణీ చేశారు. కొన్ని పరీక్షలు అవసరమున్నవారిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి స్పెషాలిటీ హాస్పిటల్స్‌కు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రజిని శ్రీనివాస్, ఆరో వార్డు కౌన్సిలర్ వరలక్ష్మి నరసింహ రిబ్బన్ కట్ చేసి ఈ మెగా హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ ఆరోగ్య శిబిరం మండల వైద్యాధికారిని డాక్టర్ శ్రీవాణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ నరసింహారెడ్డి రమాదేవి, సూపర్వైజర్లు అరుంధతి, శ్రీదేవి, వరలక్ష్మి , ఆరోగ్య కేంద్ర ఉద్యోగులు, మండల కేంద్రాలలో పనిచేయుచున్న డాక్టర్లు ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## యుద్ధాల పేరుతో ప్రజలపై భారం మోపొద్దు

**ప్రజాపక్షం/చండూరు:** అమెరికా,ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్ మరియు అరబ్ దేశాల్లోని గ్యాస్,ఆయిల్,ముడి చమురుపై ఆధిపత్యం సాధించాలనే ఉద్దేశంతో ఇరాన్‌పై యుద్ధం చేస్తున్నాయని, ఈ సామ్రాజ్యవాద చర్యలను తక్షణమే నిలిపివేసి ప్రపంచ శాంతిని కాపాడాలని సిపిఐ మండల కార్యదర్శి నలపరాజు సతీష్ కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే పరిస్థితిని ఉపయోగించుకుని కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచడం ప్రజలపై భారంగా మారిందన్నారు. వెంటనే ధరలను తగ్గించి,బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని డిమాండ్ చేశారు. గ్యాస్ కొరత, ధరల పెరుగుదలకు బీజేపీ ప్రభుత్వ విధానాలే కారణమని విమర్శించారు. దోటి వెంకన్న,చీకటిమామిడి యాదయ్య, దోమల శీను, భూతరాజు శ్రీను, గంటా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## సోదరభావంతో రంజాన్ పర్వదినం జరుపుకోవాలి

దావత్-ఏ-ఇఫ్తార్ విందులో కలెక్టర్ బి. చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** పవిత్ర రంజాన్ పర్వదినాన్ని సోదరభావంతో,మతసామరస్యంతో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు ముస్లిం మైనార్టీల కోసం దావత్‌ఏఇఫ్తార్ విందును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.బుధవారం నల్లగొండలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కలెక్టర్ పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస విరమణ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా పేద మైనార్టీలకు రంజాన్ గిఫ్ట్ ప్యాకెట్లు(తోఫా) పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.జిల్లాకు మొత్తం 5,250 గిఫ్ట్ ప్యాకెట్లు కేటాయించగా,నల్లగొండ నియోజకవర్గానికి 1,250 ప్యాకెట్లు అందజేయనున్నట్లు తెలిపారు.మైనార్టీల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, అవి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి దోహదం చేస్తాయని పేర్కొన్నారు.పవిత్ర రంజాన్ మాసాన్ని శాంతియుతంగా, సౌభ్రాతృత్వంతో జరుపుకోవాలని, సమాజంలో ఐక్యత పెంపొందించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి,జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆఫీజ్ ఖాన్,డిఎస్‌పి శివరాం రెడ్డి,డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, తహసీల్దార్ పరశురాములు, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి పన్నుల వసూలుకు సన్నాహాలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలో ఆస్తి పన్ను బకాయిదారుల నంచి ఉగాది, రంజాన్ పండుగల అనంతరం వసూళ్లను ఉధృతం చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకోసం జప్తుల వాహనం సిద్ధం చేశారు. మొండి బకాయిదారుల ఇంటి వద్దకే వాహనం వెళ్లి తుది అస్త్రం జప్తు వాడనున్నట్లు తెలిసింది. మిర్యాలగూడ మున్సిపల్ ప్రజలు ఆస్తి పన్ను బకాయిలు సుమారు రూ.20.53 కోట్లు ఉండగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిమాండ్ రూ.9.55కోట్లు ఇందులో ఇప్పటివరకు రూ.5.73కోట్లు వసూలు కాగా ఇంకా సుమారు రూ.10కోట్ల వరకు వసూలు చేస్తే 15వ ఫైనాన్స్ కమీషన్ నిధులు సుమారు రూ.15కోట్ల వరకు వస్తాయని అందుకోసం మార్చి నెలాఖరులోగా లక్ష్యం చేరుకోవాలని, ఇక జప్తులే శరణ్యమని జప్తు వాహనంతో అధికారులు, సిబ్బంది బయలుదేరనున్నట్లు తెలిసింది. సుమారు 500 మంది దీర్ఘకాలిక బకాయిలు ఉన్న వారికి రెడ్ నోటీసులు కూడా జారీ చేశారు. పండుగల అనంతరం జప్తుల పర్వం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్, మేనేజర్, రెవెన్యూ ఆఫీసర్ జి.జ్ఞానేశ్వరి పేర్కొన్నారు. ఆస్తి పన్ను వసూలు చేపట్టే సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసులను నమోదు చేశామన్నారు. మళ్లీ ఎవరైనా ఆటంకం కలిగిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

## నల్లగొండ నగరపాలక సంస్థ పేరుతో సైబర్ మోసాలు...

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ శరత్‌చంద్ర విజ్ఞప్తి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ నగరపాలక సంస్థ పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ శరత్ చంద్ర సూచించారు.ప్రాపర్టీ టాక్స్,ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించాలంటూ కొంత మంది సైబర్ నేరగాళ్లు ఫోన్ కాల్స్ చేసి,క్యూఆర్ కోడ్‌లు పంపిస్తూ డబ్బులు వసూలు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.నగరపాలక సంస్థ అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగతంగా కాల్ చేసి లేదా క్యూఆర్ కోడ్ పంపించి ఫీజులు వసూలు చేయరని స్పష్టం చేశారు.ప్రజలు ఇలాంటి మోసపూరిత కాల్స్, సందేశాలకు స్పందించకుండా జాగ్రత్తగా ఉండాలని, తమ ప్రాపర్టీ టాక్స్,ట్రేడ్ లైసెన్స్ ఫీజులను అధికారిక మున్సిపల్ కార్యాలయంలో లేదా అధికారిక విధానాల ద్వారానే చెల్లించాలని సూచించారు.అనుమానాస్పద కాల్స్ లేదా సందేశాలు వచ్చిన వెంటనే నగరపాలక సంస్థ అధికారులకు సమాచారం అందించాలని కమిషనర్ కోరారు.

## భారత రాజ్యాంగాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** భారతదేశ అత్యున్నత ప్రమాణిక గ్రంథమైన రాజ్యాంగాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలని ప్రముఖ దళితవాది,విశ్వజన కళామండలి జాతీయ అధ్యక్షులు మాస్టర్జీ డిమాండ్ చేశారు. వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ను కలసి వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా మాస్టర్జీ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరునికి హక్కులు,బాధ్యతలు,సమానత్వం వంటి విలువలను నేర్పే అత్యంత ముఖ్యమైన పత్రం అని తెలిపారు.భావి భారత పౌరులుగా ఎదుగుతున్న విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కల్పించడం అత్యవసరమని పేర్కొన్నారు.కేరళ రాష్ట్రంలో ప్రభుత్వం రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చి,ప్రతి విద్యార్థికి రాజ్యాంగ పుస్తకాలను అందించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్టంలోని 33 జిల్లాలో యాత్ర చెప్పడడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున,జై భీమ్ మహాసేన జాతీయ అధ్యక్షులు రాజ్యాంగం అంజన్న, కెవిపియస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శీను,వంటపాక యాదగిరి, ముత్యాలు,రమణ పాల్గొన్నారు.

## బాబోయ్ కందకం వాసన భరించలేకపోతున్నాం



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండల కేంద్రం ఫలక్నామ కాలనీలో బాలుర వసతి గృహం వెళ్లే రోడ్డు కందకము మురికి నీటితో నిండటంతో రోడ్డుపై ప్రవహిస్తున్నది. కందకం పక్కనే బాలుర వసతిగృహం ఉండడంతో మురికి నీటి వల్ల కాలనీవాసులు, విద్యార్థులు నిత్యం మురికి వాసనతో ప్రమాదకరమైనటువంటి పాములతో నిత్యం దినదిన గండంగా జీవనం కొనసాగిస్తున్నారు. గతంలో ఈ కందకం సమస్యను ఎంతో మంది పాలకుల దృష్టికి కాలనీవాసులు తీసుకెళ్లిన నామమాత్రపు మాటలు మాట్లాడి పక్కకు పెట్టిన వైనం. కందకంలోని విషపూరితమైనటువంటి పాములు ఇళ్లల్లోకి వస్తున్నాయి. ఇప్పటికైనా నూతన పాలకవర్గం కంద కం మురికి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని చూపించాలని కాలనీవాసులు, వసతి గృహం విద్యార్థులు కోరుతున్నారు.



## రీసైక్లింగ్‌తో 'స్వచ్ఛ సూర్యాపేట' సాధ్యం

మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, ఇండ్ల వద్దనే తడి, పొడి వ్యర్థాలను వేరు చేయడం ద్వారా రీసైక్లింగ్ ప్రక్రియ సులభతరం అవుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. ప్రపంచ రీసైక్లింగ్ దినోత్సవం సందర్భంగా సూర్యాపేట మున్సిపాలిటికి సంబంధించిన జమునానగర్ ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్, వర్మీ కంపోస్ట్ యార్డ్‌ను ఆమె మున్సిపల్ కమీషనర్ హన్మంత రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వ్యర్థ ప్లాస్టిక్‌ను టైల్స్, ఇటుకలు, ఆక్యుప్రెషర్ మ్యాట్‌లుగా మారుస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను సరైన విధంగా వినియోగించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. రీసైక్లింగ్ ద్వారా వ్యర్థాలను ఉపయోగకరమైన వస్తువులుగా మార్చడం ఎంతో ప్రాముఖ్యమైందన్నారు. ప్రజ ల సహకారం లేకుండా ఏ లక్ష్యాలు సాధ్యం కావని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ హన్మంత రెడ్డి, వైస్‌చైర్‌పర్సన్ మహమ్మద్ షఫీఉల్లా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



